క్లుప్తంగా

ఎస్ఐని సస్పెండ్ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పులివెందుల విద్యుత్ ఉద్యోగులపై దాడిచేసిన ఎస్ఐ అనిల్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీలో వర్షం పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో మరమ్మతులు చేస్తున్నామని విద్యుత్ ఉద్యోగి జేఎల్ఎం గురు, పోల్ టు పోల్ విధులు నిర్వహిస్తున్న షఫీ చెప్పినా వినకుండా రక్త గాయాలయ్యే విధంగా కొట్టిన ఎస్ఐను తక్షణం సస్పెండ్ చేయాలని కోరుతున్నాయన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కడప ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కను పెంచాలని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. ఇందులో భాగంగా 'అమ్మ పేరిట ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా శనివారం కడప 15వ వార్డు పీఎస్ నగర్‌లోని మున్సిపల్ కార్పోరేషన్ ప్రాథమిక పాఠశాలలో ఫారెస్టు డిపార్టుమెంట్‌వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, పిల్లలు కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవ రాయుడు, ఎంవీ రాఘవప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. శనివారం కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అంకితభావాన్ని కలిగి ఉండాలన్నారు. చెట్లు మనకు అవసరమైన స్వచ్ఛమైన గాలిని ఇవ్వడంతో పాటు, భూతాపాన్ని తగ్గిస్తాయని దీంతోపాటు వర్షాలు పడేలాగ చేస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని పెంచి పెద్దచేసే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజారావు, అధ్యాపకులు హబీబుల్లా, శివహరి, ప్రసాద్ రెడ్డి, శ్రీరాములరెడ్డి, వెంకట్రామిరెడ్డి, చంద్రమౌళి, సుజాత పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి



మాట్లాడుతున్న గంగా సురేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ కృష్ణారెడ్డి ని తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీసీ కృష్ణారెడ్డి గతంలో మచిలీపట్నంలో ఉన్న కృష్ణా విశ్వవిద్యాలయంలో రిజిస్టర్ గా పనిచేస్తున్నప్పుడు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని , గెస్ట్ హౌస్ లో అనైతిక కార్యకలాపాలు చేసేవారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)సోదాలు చేసిందన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని అనేక ఆరోపణలు ఉన్న వ్యక్తిని ఇన్‌చార్జ్ వీసీగా నియమించడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు శివ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు బి. అనిల్ కుమార్, విజయ్ కుమార్, తరుణ్ పాల్గొన్నారు.

అన్యాక్రాంత ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప మండల పరిధిలోని చిన్న చౌక్ గ్రామ పొలం సర్వే నెంబర్ 1130 లో మూడు ఎకరాలకు పైబడిన ప్రభుత్వ స్థలం క్రమేపీ అన్యాక్రాంతమవుతోందని, భూ పరిరక్షణకు తగు చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కడప తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణ రెడ్డి కి సీపీఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ బాలుర గురుకుల పాఠశాల దగ్గర సాగర్ కాలనీ వద్ద కోట్లాది రూపాయలు విలువచేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ బోర్డును తొలగించి, కంప చెట్లను బుల్డోజర్ తో పెకలించి పునాదులు నిర్మించుకొని రూములు కట్టుకుంటూ, నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించుకుని, కరెంటు మీటర్లు బిగించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, వృద్దె మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు కె.లింగన్న, వి.భాగ్యలక్ష్మి, పి. అంకుశం, మురళి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కడప రిమ్స్ జూడాలు

- రిమ్స్‌లో కొనసాగుతున్న ఆందోళన
- కడప నగరంలో భారీ ఎత్తున ర్యాలీ చేసిన జూనియర్ డాక్టర్లు



రిమ్స్ ఆవరణంలో జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్న పీజీలు, వైద్య విద్యార్థులు



ఆందోళనలో పాల్గొన్న పీజీలు, వైద్య విద్యార్థులు

కడప అర్బన్ : పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా నగరంలో వైద్యకళాశాలలో అత్యాచారానికి గురై, దారుణంగా హత్యకు గురైన మహిళా పీజీ డాక్టర్ సంఘటనపై కడప రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లు ఓపీ సేవలకు గైర్హాజరై కళాశాల ఆవరణంలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ సహచర మహిళా పీజీ డాక్టర్ పట్ల జరిగిన ఘోరమైన సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళా పీజీ డాక్టర్ పట్ల జరిగిన సంఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలనీ, వైద్యులకు సరైన రక్షణ కల్పించాలనీ డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఈ ఆందోళన దశలవారీగా కొనసాగిస్తామన్నారు. నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన జూనియర్ డాక్టర్ల ఆందోళన మధ్యాహ్నం దాకా కొనసాగింది.

జూనియర్ డాక్టర్స్ ఆధ్వర్యంలో కడప నగరంలో భారీ ర్యాలీ ..

కడప రిమ్స్ జూనియర్ డాక్టర్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా శనివారం సాయంత్రం మహావీర్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీ రాజీవ్ మార్గ్ మీదుగా ఎర్రముక్కపల్లి, తిరిగి మహావీర్ సర్కిల్ వరకు కొనసాగింది. భారీగా నిర్వహించిన ఈ ర్యాలీలో జూనియర్ డాక్టర్స్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రిమ్స్‌లో జూనియర్ డాక్టర్స్ ఆందోళనకు కడప ఎమ్మెల్యే మద్దతు

కడప రిమ్స్ ఆవరణంలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళన, నిరసనదీక్ష శిబిరాన్ని కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, తమ పార్టీ కార్యకర్తలతో శనివారం వెళ్లి సందర్శించారు. జూనియర్ డాక్టర్స్ ఆందోళనను సీఎం ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతామని హామీ ఇచ్చారు.

అత్యాచార దుండగులను కఠినంగా శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కోల్‌కతా ప్రభుత్వ ఆసుపత్రిలో నైట్ డ్యూటీలో ఉన్న లేడి జూనియర్ డాక్టర్ ను సామూహిక అత్యాచారం చేసి చంపిన దుండగులందరినీ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ఇంకా మహిళలకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీ చదువుతూ జూనియర్ డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు పై సామూహిక అత్యాచారం హత్యకాండ జరగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్ వెంకట శివ, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి మద్దిలేటి, రైతు సంఘం నాయకులు మనోహర్ రెడ్డి, శివారెడ్డి, లోక్ సత్తా నాయకులు శ్రీకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజామణి, ఏపీ మహిళా సమాఖ్య, ప్రజా సంఘాల నాయకులు స్వర్ణ, బుజ్జి, ఆర్ బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కామాంధులను ఉరితీయాలి

కడప ఎడ్యుకేషన్ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు, వసతి గృహ వార్డెన్ ఆరోగ్యమ్మ, విద్యార్థినిలు హేమావతి, పావని, చైత్ర, లక్ష్మీకృష్ణ, వనిత వాణి, రామాంజలి పాల్గొన్నారు.

■ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ పై అత్యాచారం చేసి అతి క్రూరంగా దాడి చేసి హత్య చేసిన వారిని బహిరంగంగా ఉరితీయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్, ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని శంకరాపురంలో ఉన్న వసతి గృహంనందు విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఏఐయస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడారు.

మానవ మృగాలను తక్షణమే ఉరితీయాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసిన వారిని తక్షణమే ఉరి తీయాలని కడప టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం కడప నగరంలోని మట్టి పెద్దపులి వద్ద టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జూడాలకు మద్దతుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బారాయుడు, సుధాకర్, అబ్దుల్లా, వహీద్, అక్బర్, గౌస్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ర్యాలీ

కడప రూరల్ : కోల్‌కతాలోని ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనకు నిరసనగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం క్యాండిల్‌ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ఆ శాఖ కార్యాలయం నుంచి ఐటీఐ సర్కిల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఫిమ్స్) ప్రిన్సిపల్ డాక్టర్ శైలారేఖ తెలిపారు. కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ స్థానిక ఫిమ్స్ కళాశాలలో విద్యార్థినిలు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలారేఖ మాట్లాడుతూ ఏ తప్పు లేకుండా విధి నిర్వహణలో విశ్రాంతి తీసుకుంటున్న ఆమెపై మాటువేసి కాటేసిన మానవ మృగాలను క్షమించరాదన్నారు. మహిళా వైద్యురాలి పట్ల ఆటవికంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ ఘటనలో దుండగులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునే హేయమైన చర్య అన్నారు.



జూనియర్ డాక్టర్లతో పాటు ఆందోళనకు మద్దతును ఇస్తున్న కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి



గీతాలాపన ద్వారా తమ నిరసనను తెలియజేస్తున్న వైద్య విద్యార్థులు

రక్షణ కల్పించాలి



దేశ వ్యాప్తంగా అన్ని రంగాల్లో మహిళలు ముందుండి ప్రగతిని సాధించడంలో తమ వంతుగా కీలకపాత్ర పోషిస్తున్నారు. వైద్యులకు, ప్రధానంగా మహిళా వైద్యులకు రక్షణ లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకుని తగిన చట్టాలను తీసుకుని వచ్చి వేగవంతంగా నిందితులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. - డాక్టర్ మౌనిక, పీజీ వైద్య విద్యార్థిని, కడప రిమ్స్

మరింతగా ఆందోళన ఉధృతం



ప్రజలు ప్రాణదాతలుగా భావించే డాక్టర్స్‌కు ప్రభుత్వాలు రక్షణ కల్పించకపోతే ఆందోళనను మరింత ఉధృతంగా చేపడతాం . కోల్‌కతాలో మహిళా పీజీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యాన్ని వైద్యులుగానీ, మహిళా వైద్యులుగానీ, ప్రజలుగానీ ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. నిరసనలు, ర్యాలీలతో గాక ఇంకా ఇతర అనేకమార్గాలలో తమకు న్యాయం జరిగేవరకు పోరాడుతూనే వుంటాం.

- డాక్టర్ నిఖిల్, కడప రిమ్స్ జూనియర్ డాక్టర్స్ నాయకుడు



అంబేద్కర్ సర్కిల్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న కడప టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ నాగరాజు, ఇతర అధికారులు



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది

జర్నలిస్టు సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జర్నలిస్టుల సంక్షేమం ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 68వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప నగరంలోని జిల్లా పరిషత్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అనాథలు, వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలోనూ జర్నలిస్టులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఏపీయూడబ్ల్యూజేకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రమణారెడ్డిలతోపాటు రామాంజనేయరెడ్డి, దేవేంద్రా చారి, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు శివరాం, బాలకృష్ణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, కెమెరామెన్‌ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్



స్ప్రే చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వైఓ నందన్



బుగ్గవంకలో స్ప్రే చేస్తున్న డ్రోన్

కొత్త కమిషనర్ వినూత్న ఆలోచన

కడప కార్పొరేషన్ : కడప నగరంలో దోమల నియంత్రణకు డ్రోన్ల ద్వారా స్ప్రేయింగ్ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ వైఓ నందన్ అన్నారు. శనివారం స్థానిక నారాయణ కాలేజీ సమీపంలో బుగ్గవంక బ్రిడ్జిపై నుంచి డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ చేసే ప్రక్రియను ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుగ్గవంకలో గుర్రపు డెక్క చాలా ఎక్కువగా ఉండటం వల్ల దోమల ఉత్పత్తి అత్యధికంగా జరుగుతోందన్నారు. దోమల ఉత్పత్తిని నియంత్రించడానికి బుగ్గవంకలో మనుషులు వెళ్లి స్ప్రేయింగ్ చేయలేరు కాబట్టి డ్రోన్ల ద్వారా స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. దీనిద్వారా సత్ఫలితాలు వస్తే రెగ్యులర్‌గా చేయిస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా శాస్త్రి నగర్, ప్రకాష్ నగర్, మోచంపేట ప్రాంతాల్లో ట్యాప్ గ్యాప్ అనాలసిస్ సర్వే చేపట్టారు. ఆ తర్వాత ప్రకాష్ నగర్ వార్డు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇంటింటి కొళాయి కనెక్షన్ వివరాలను ఈఆర్‌పీ లాగిన్‌లో ఎలా నమోదు చేయాలో సూచనలిచ్చారు. ఆ తర్వాత టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వే ప్రక్రియను రెవెన్యూ, ఇంజినీరింగ్ వార్డు ఎమినిటీస్, అడ్మిన్ సెక్రటరీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో శనిత్రయోదశి పూజలు



శనీశ్వరునికి భక్తుల అభిషేకం



స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

కడప కల్చరల్ : శనిత్రయోదశి సందర్భంగా శనివారం స్థానిక శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనేశ్వరస్వామికి ప్రత్యేకమైన తైలాభిషేకం నిర్వహించారు. గ్రహాలు ఆదిదేవత శ్రీ విజయదుర్గమ్మ ఆధీనంలో ఉంటాయని భావిస్తారు గనుక శనిత్రయోదశి రోజున అమ్మవారి సన్నిధిలో నవగ్రహాల్లోని శనీశ్వర స్వామికి తైలాభిషేకం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ మాసంలో అత్యంత అరుదుగా రెండుసార్లు శనీశ్వరునికి పూజ నిర్వహించే అవకాశం లభిస్తుంది గనుక దీన్ని ఎంతో విశేషమైనదిగా, పవిత్రమైనదిగా భావిస్తారు. తొలుత ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గా ప్రసాద్ భక్తులతో కలసి శనీశ్వరస్వామికి పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ శ్రావణమాసం 31వ తేదీ కూడా స్వామికి తైలాభిషేకం నిర్వహిస్తామని అర్చక స్వాములు తెలియ చేశారు. స్థానిక చిన్నచౌకు రామకృష్ణనగర్‌లోని శ్రీ శనీశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని అందచేయాలి

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూ వుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలియజేశారు. శనివారం మహిళా సంరక్షణ కార్యదర్శులతో (మహిళా పోలీసులు) ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి అక్రమ రవాణాతో పాటు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించేవారి వివరాలను సేకరించాలన్నారు.



మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్ రెడ్డి

సృజనతోనే ఫొటోగ్రఫీకి ప్రత్యేక గుర్తింపు

కడప కల్చరల్ : సృజనాత్మక శక్తితోనే ఫొటోగ్రఫీ రంగంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో పది మంది ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఈనెల 19న హౌసింగ్‌బోర్డు రామాలయంలో నిర్వహించనున్న ఫోటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ శివశంకర్ ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీతోపాటు ఫొటోగ్రాఫర్లు అప్‌డేట్ కావాలన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, లయన్స్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఫొటోగ్రాఫర్ యల్లేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ కోటేశ్వరరావు, చంద్రారెడ్డి, గురుమోహన్‌రెడ్డి, యల్లేశ్వరరావు, శివయ్య, సురేష్, చింతకుంట పుల్లయ్య, నిత్య, రవి, శ్వేత, కొండూరు జనార్దన్‌రాజు, కొండారెడ్డి, బాల యల్లారెడ్డి, రమణారెడ్డి, వర్మ, మునికుమార్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

నివాళి

కోల్‌కత్తాలో కామాంధుల దుశ్చర్యకు బలైన యువ వైద్య విద్యార్థికి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ఒక నిమిషం పాటు మౌనం వహించి నివాళులర్పించారు.